# తిథి-నక్షత్రం

**బ**స్సు వేగంగా పోతోంది. వాతావరణం మబ్బుపట్టి చాలా ఆహ్లాదంగా ఉంది. చుట్టూ కనుచూపు మేర పచ్చదనం... చిన్న చిన్న ఊళ్లు దాటిపోతున్నాయి... కుతూహలంగా చూస్తోంది శ్యామల. సిటీలోనే పుట్టి పెరిగి అక్కడే స్థిరపడిన శ్యామలకి పల్లెటూర్లతో బొత్తిగా పరిచయం లేదు. సినిమాల్లో చూడ్డం తప్ప, ఏనాడూ పల్లెటూరికి వెళ్ళలేదు. ఇప్పుడీ ప్రయాణం కూడా తమాషాగా జరుగుతోంది.

శ్యామలకి పదిరోజులు సెలవులు వచ్చాయి. భర్త రామకృష్ణకి కూడా టూర్ వెళ్ళాల్సి వచ్చింది. భర్త వెంట వెళ్దామనుకుంది శ్యామల. కానీ అతను అర్ధరాత్రిదాకా మీటింగులూ సెమినార్లూ అంటూ బిజీగా ఉంటాడు. తను ఒంటరిగా ఉండాలంటే విసుగ్గా ఉంటుంది. శ్యామల పుట్టిల్లు కూడా ఉన్న ఊళ్లోనే. అక్కడికి వెళ్దామంటే, అమ్మ అమెరికా వెళ్లింది, చెల్లెలి పురిటికి. ఏం చేద్దామా అని ఆలోచిస్తూ ఉంటే "పోనీ మా పెదనాన్నగారింటికి వెళ్లిరారాదూ" అన్నాడు రామకృష్ణ.

రామకృష్ణ పెత్తండ్రి భూషణం గారిది గుంటూరు జిల్లాలో ఓ పల్లెటూరు. రామకృష్ణకి చిన్నతనంలోనే తండ్రి చనిపోతే, ఆయనే పెంచి పెద్ద చేశాడు. చదువు పూర్తవుతుండగా తల్లికూడా చనిపోయింది. రామకృష్ణ పెళ్ళి కూడా పెత్తండ్రి చేతుల మీదుగానే జరిగింది.

"వెళ్తే వాళ్లకి ఇబ్బంది అవదు కదా!" అంది శ్యామల కాస్త సంశయిస్తూ.

"ఏం కాదు. ఎంతో సంతోషిస్తారు. వచ్చి నాలుగు రోజులుండమని ఎప్పటినుంచో చెప్తున్నారు. మనకు వీలుగాక వెళ్ళలేదు. పెద్దవాళ్ళు... వాళ్ళెలాగూ

రాలేరు. మనమే వెళ్ళి చూస్తే బావుంటుంది. నీకూ రొటీన్ నుంచి ఛేంజ్‌గా ఉంటుంది. నువ్వు సరేనంటే ఉత్తరం రాస్తాను" అన్నాడు.

"సరే రాయండి" అంది శ్యామల. వెంటనే సమాధానం వచ్చింది, తప్పకుండా రమ్మని. ఎంతో ఆప్యాయంగా రాశారు. శ్యామల ప్రయాణం అయింది. గుంటూరు దాకా రైలు, తరవాత బస్. బస్ గమ్యం చేరేసరికి పదకొండు గంటలు అయింది. సూట్‌కేస్ చేత్తో పట్టుకుని బస్ దిగింది శ్యామల. ఓ అబ్బాయి వచ్చి "భూషణం గారింటికేనా అమ్మా?" అని అడిగాడు.

"అవును" అంది శ్యామల.

"తాతయ్యగారు పంపించారు, రండి" అంటూ సూట్‌కేసు అందుకున్నాడు. రిక్షా మాట్లాడి ఎక్కించాడు. చిన్న సైజు బండిలా ఉన్న గూడు రిక్షాలో ప్రయాణం చాలా సరదాగా అనిపించింది శ్యామలకి.

ఇల్లు చేరుకున్నారు. పెంకుటిల్లు బొమ్మరిల్లులా ఉంది. భూషణంగారు వరండాలో ఉన్నారు. శ్యామలను ఆదరంగా పలుకరించారు.

వరలక్ష్మమ్మ మాత్రం భోజనాల గది దాటి రాలేదు. ఆవిడ మడికట్టుకుని ఉంది. "రామ్మా రా! ఎన్నాళ్ళకి వచ్చావు" అంటూ ఆదరంగా పలుకరించింది. తెల్లగా తోమిన కంచు గ్లాసుతో మంచి నీళ్లు తెచ్చి నేల మీద పెట్టి తీసుకోమంది. ఆ వెంటనే గ్లాసు నిండా కమ్మటి కాఫీ తెచ్చి కిందపెట్టి తీసుకోమంది.

అందరి యోగ క్షేమాలూ తెలుసుకుంది.

"ఇదుగో! నేను మడి కట్టుకోనా, ఇంకా ఆలస్యం ఉందా?" అని అడిగాడు భూషణం.

"అయిపోయింది మడికట్టుకోండి" అంది ఆవిడ.

"శ్యామలా! స్నానం చేసి రామ్మా వడ్డించేస్తాను. ఎప్పుడనగా ఏం తిని బయలు దేరావో" అంది.

అంతలోనే ఒకమ్మాయి గేటు తీసుకుని లోపలికి వచ్చింది. ఇరవై ఏళ్ళుంటాయి. వాయిల్ చీర, మెళ్ళో మంగళసూత్రాలూ, నల్లపూసలూ, పచ్చగా, సన్నగా ఉంది.

"పిన్నిగారూ! మా అత్తయ్య ఇవాళ తిథి, నక్షత్రం ఏమిటో కనుక్కు రమ్మంది" అంది.

"వచ్చావా? ఇంకా రాలేదేమిటా అనుకుంటున్నాను. మీ బాబాయిగారు ఇప్పుడే దేవతార్చన మొదలుపెట్టారు. సరిగ్గా ఈ వేల్టికి వస్తావు. సరేలే ఏం చేస్తాం? కాసేపాగు. ఇదుగో చూడు సీతా, మా కోడలు ఊర్నుంచి వచ్చింది. స్నానం చేస్తుంది స్నానాల గది చూపించు నాకు వంటింట్లో పనుంది" అంటూ వెళ్ళిపోయింది.

సీత శ్యామల వంక చూసి పలకరింపుగా నవ్వింది. శ్యామల సూట్‌కేసు తీసి బట్టలు తీసుకుంది. స్నానాల గది చూపించింది సీత.

బండలు పరిచిన గది... పెద్ద కాగుతో వేడినీళ్ళు... సిమెంటు తొట్లో చన్నీళ్లు. పక్కనే ఇత్తడి గంగాళం. చెంబుతో నీళ్ళు తీసుకుని తనివితీరా స్నానం చేసింది శ్యామల.

ఇంట్లోకి వచ్చి తల ఆరబెట్టుకుని, జడ వేసుకుని వచ్చేసరికి భూషణం గారి దేవతార్చన పూర్తి అయింది. అందరికీ తీర్థం ఇచ్చారు.

"ఇవాళ తిథి పంచమి, నక్షత్రం శ్రవణం వెళ్ళిరా" అని చెప్పారు సీతతో. సీత వెళ్లిపోయింది.

వెండి కంచంలో భోజనం వడ్డించింది వరలక్ష్మమ్మ. ఆవిడ కొసరి కొసరి వడ్డిస్తుంటే ఎక్కువగానే తినేసింది శ్యామల. వేడినీళ్ళ స్నానం, సుష్టుగా భోజనం, నిద్ర తూలుకొచ్చింది. హాయిగా నిద్రపోయింది.

సాయంత్రం వరలక్ష్మమ్మతో గుడికి వెళ్లింది అందరికీ "మా కోడలు" అని మురిపెంగా పరిచయం చేసుకుంది ఆవిడ. ఆ ఊరు, ఆ వాతావరణం ఎంతగానో నచ్చాయి శ్యామలకు.

"ఇలా రావడం మంచిదే అయింది" అనుకుంది.

మర్నాడు పొద్దున వరలక్ష్మమ్మకు సాయం చెయ్యబోయింది.

"వద్దులేమ్మా, రాకరాక వచ్చావు. నీకెందుకు శ్రమ" అని వారించింది ఆవిడ.

అయినా తన సరదాకొద్దీ పూజకు పువ్వులు కోసింది. తులసికోట దగ్గర ముగ్గు పెట్టింది. వరలక్ష్మమ్మ స్నానం చేసి, మడికట్టుకున్న తరువాత, తీరిగ్గా తను తెచ్చుకున్న నవల చదువుకుంటూ కూర్చుంది శ్యామల.

వరలక్ష్మమ్మ అటు వచ్చి" శ్యామలా! అలమరలో డబ్బాలో కారప్పూస ఉందమ్మా తీసుకో'' అని చెప్పి పనిలో పనిగా "మీరిహ మడి కట్టుకోవచ్చు నా వంట అయిపోవచ్చింది" అని భర్త చెవిన వేసి వెళ్ళిపోయింది.

ఆయన లేచి వెళ్ళారు. మరో అయిదు నిమిషాల్లో సీత వచ్చింది.

"పిన్నిగారూ! ఇవాళ తిథీ నక్షత్రం ఏమిటో అడిగిరమ్మంది మా అత్తయ్య" అంది హాల్లో నిలబడి భోజనాలగది తలుపు తడుతూ.

తలుపు తీసుకుని వచ్చింది వరలక్ష్మమ్మ.

"వేళపాళా లేదుటే సీతా నీకు! సరిగ్గా ఆయన పూజకు కూర్చునే వేళా నువ్వు వచ్చే వేళా. సరే ఏం చేస్తాం అటువచ్చి ఆ చల్ల గదిలో కూర్చో" అంది కాస్త చిరాగ్గా.

ఇదంతా చూస్తున్న శ్యామల "ఈ మాత్రం దానికి మావయ్యగారు లేచేదాకా ఆగటం ఎందుకు? ఆ క్యాలెండర్ ఇటివ్వండి నేను చూసి చెప్తాను" అంది.

"సరేలే ఇంగ్లీషు చదువులు చదువుకున్న వాళ్ళకి తిథులు చూడ్డం ఏం తెలుస్తుంది? దీనికేం పనికొట్టుకు పోతోంది? కూర్చుంటుంది కాసేపు" అనేసి వెళ్ళిపోయింది. ఆవిడ వెనకే వెళ్ళింది సీత.

శ్యామలకి చిరాకు వేసింది. "తెలుగు రాకుండా ఏకంగా పుడుతూనే ఇంగ్లీషు చదువుకున్నామా! ఈవిడ చాదస్తం కాకపోతేనూ. అయినా నా కెందుకీ గొడవలన్నీ" అనుకుని నవల చదువుకోవడంలో మునిగిపోయింది.

మర్నాడు పొద్దున సుబ్బి వచ్చింది. బట్టలుతకడానికి తీసుకుపోతూ "అమ్మగారూ మా అమ్మాయికి జ్వరం తగిలి తగ్గింది. ఈ పూట పథ్యం పెడుతున్నా, కాస్త పచ్చడి ఉంటే పెట్టండి" అని అడిగింది.

వరలక్ష్మమ్మ కాస్త పాత నిమ్మకాయ ఊరగాయ అరిటాకుతో తెచ్చి సుబ్బిచేతిలో పెట్టింది.

సుబ్బి శ్యామలతో కబుర్లు మొదలు పెట్టింది. వరలక్ష్మమ్మ కూడా మాట కలిపింది.

అదే సమయంలో వచ్చింది సీత.

పిన్నిగారూ! ఈ పూట తిథి ఏమిటో అడగమంది మా అత్తయ్య" అంది.

వరలక్ష్మమ్మ మొహం చిటపటలాడింది. "రామ రామ! ఇదేం అయోమయమే తల్లీ. ఎన్నిసార్లు చెప్పినా నీ తలకి ఎక్కదా ఏం? నీలాంటి కోడలుతో ఆ మహా ఇల్లాలు కాబట్టి వేగుతోంది. ఇంకొకరైతే చీపురుకట్ట తిరగేసేవాళ్ళే. సరే ఏం చేస్తాం కూర్చో ఆయన దేవతార్చన కానీ" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

సుబ్బి కూడా వెళ్ళిపోయింది.

ఇదంతా చూస్తున్న శ్యామలకి చిరాకేసింది. "సీతా ఇటురా!" అని పిలిచింది. దగ్గరకు వచ్చింది సీత. "నువ్వెంతదాకా చదువుకున్నావు?" సీరియస్‌గా అడిగింది.

"ఏడో తరగతి" బుద్ధిగా సమాధానం చెప్పింది సీత.

"మరింకేం? ఆవిడంత విసుక్కుంటూ ఉంటే, మళ్ళీ మళ్ళీ అదే పొరబాటు చేస్తావేం? వాళ్ళు పనిలో ఉన్నవేళ వచ్చి తిథి అడిగి చీవాట్లు తినే బదులు రెండు రూపాయలు పెట్టి తెలుగు క్యాలెండరు కొనుక్కుని తిథి చూసుకోలేవా?" మందలింపుగా అడిగింది శ్యామల.

తలెత్తి శ్యామల వంక చూసి, ఫక్కున నవ్వేసి లోపలికి పారిపోయింది సీత.

తెల్లబోయింది శ్యామల. "ఈ పిల్లకేమైనా పిచ్చా మంచికి చెప్తే వినకుండా ఆ వెకిలి నవ్వేమిటి. సిగ్గులేకుండా!" అనుకుంది.

ఈ పల్లెటూరి మొద్దులింతే. "తలలో మన్ను తప్ప మెదడుండదు" అని విసుక్కుంది. ఏది ఏమైనా సీత ప్రవర్తన ఎంతమాత్రం నచ్చలేదు శ్యామలకి. రెండు చీవాట్లు వెయ్యాలనిపించింది. చదువుతున్న పుస్తకం పక్కన పడేసి లోపలికి వెళ్ళింది విసురుగా.

భోజనాల గదికి ఒకవైపు వంటగది, మరోవైపు చల్లగది. దాన్ని పూర్వం చల్ల చేసేందుకు ఉపయోగించినా ఇప్పుడు స్టోర్ రూమ్‌గా వాడుతున్నారు. ఆ గది తలుపు తీసి ఉంది. భూషణంగారు దొడ్లో అరుగుమీద కూర్చుని, విభూతి పట్టెలు పెట్టుకుంటూ ఆదిత్యహృదయం చదువుకుంటున్నారు.

శ్యామల చల్లగదివైపు వెళ్ళింది. అక్కడ కనిపించిన దృశ్యం చూసి తెల్లబోయింది. చిన్న అరిటాకు ముందు పెట్టుకుని, నేలమీద కూర్చుని ఉంది సీత. చేతిలో ఉన్న స్టీలు గిన్నెలో ఆవకాయ అన్నం ముద్ద కలిపి సీత ఆకులో వేసింది పక్కనే కూర్చున్న వరలక్ష్మి.

ఆవురావురుమని తినసాగింది సీత.

"ఆ! ఆ! మెల్లిగా, నెమ్మదిగా తిను ఇంకో ముద్ద ఏం కలపను?" అని అడిగిందావిడ.

"చింతకాయ పచ్చడి!" తింటూనే సమాధానం చెప్పింది సీత.

"ఓసీ నీ ఇల్లు బంగారంగానూ, వట్టి పచ్చడి మెతుకులు తింటే వేడి చెయ్యదూ! నా మాట విని, కాస్త పెరుగన్నం పెడతా తిను" అంది.

"పెరుగన్నం తింటే డోకొస్తుంది పిన్నిగారూ!" అంది గారంగా!

"సరే వద్దులే" అని ఆ పక్కనే వున్న అన్నంగిన్నెలోంచి అన్నం స్టీలు గిన్నెలో వేసి, చింతకాయ పచ్చడి వేసి, చారెడు నెయ్యి వేసి కలిపి, అరిటాకులో వేసింది. లొట్టలు వేస్తూ తింటోంది సీత.

అప్రయత్నంగా నోట్లో నీళ్ళూరాయి శ్యామలకి. 'ఏమిటిదంతా' అనుకుంటూ లోపలికి వెళ్ళింది. శ్యామలని చూసి ఇద్దరూ గతుక్కుమన్నారు.

"అత్తయ్యా ఏమిటిదంతా" అని అడిగింది.

"ఏం చెప్పమంటావు? అదో రామాయణం. వీళ్ళ అత్త ఉందే, గడుసుపిండం. మనిషి మంచిదే కాకపోతే ఒకప్పుడు తన అత్త తనని కాల్చుకుతిన్నది కాబట్టి ఇప్పుడు తనూ తన కోడలిని కాల్చుకు తింటాననంటుంది. దీని మొగుడూ, మామా అమాయకులు. చదువూ సంధ్యా లేవు. పొద్దస్తమానం పొలంలో చాకిరీ చెయ్యడం తప్పించి ఇంటి సంగతి పట్టదు.

ఓపలేని పిల్ల ఇంట్లో ఉంది కదా... ఇన్ని అరిసెలో, జంతికలో చేసుకుని డబ్బాలో పెట్టుకుంటే పిల్ల అటు వచ్చీ ఇటు వచ్చీ ఓ ముక్క నోట్లో వేసుకోదూ! ఆ మాత్రం ఇంగితం ఆ అత్తకు లేదు. పొద్దున్నెప్పుడో తాగిన కాఫీ నీళ్ళతో, మగాళ్ళు వచ్చి భోజనం చేసేదాకా ఉండాలంటే కడుపుతో ఉన్న పిల్లకు కళ్ళు తిరగవూ? అందుకే ఇదుగో ఈ నాటకం. పోనీ బాహాటంగా పిలిచి పెడదామంటే 'నా కోడలికి పెట్టడానికి నువ్వెర్తివనీ' అని తగాదాకి వస్తుంది. అందుకే గుట్టుగా పెడుతున్నాను" అంది వరలక్ష్మమ్మ.

"అత్తగారి గుట్టు కాస్తా కోడలి దగ్గర బయటపడ్డట్టు ఉందే" అన్న భూషణం మాటలకు అటు తిరిగి చూసింది శ్యామల.

భోజనాల గదిలోనే మూలగా ఉన్న దేవుడి మందిరం ముందు కూర్చున్నాడు ఆయన. సానా, చెక్కా తీసుకుని గంధం తీస్తూ, "అమ్మాయ్! బస్తీలో ఉండేవాళ్ళకి పర్వాలేదుగానీ, మాకు సవాలక్ష మొహమాటలు... నిరుడు దీని పెళ్ళికి నన్నూ ప్రయాణం చేయించాడు దీని మామగారు. మనింటికి వచ్చే పిల్లే కదా, గృహప్రవేశంలో చూస్తాలే అన్నా వినలేదు. సరే. వెళ్ళాం. లక్షణంగా మూడు పూటలా విందు భోజనాలు

చేశాం. వెళ్ళినవాడిని నోరు మూసుకుని చక్కా రావచ్చా! ఊరుకున్నవాడిని ఊరుకోకుండా కన్యాదాత దగ్గరికి వెళ్ళి "పెళ్ళి బ్రహ్మాండంగా చేశారు" అన్నాను.

ఆయన నా చేతులు పట్టుకుని "పెద్దవారు... నా పిల్లని ఓ కంట కనిపెట్టి ఉండండి. అమాయకురాలు. నోరు లేనిది. కన్నవాళ్ళం కాళ్ళు కడిగి కన్యాదానం చేశాక, పరాయివాళ్ళమే. మీరు నాలుగిళ్ళ అవతల ఉంటారు. మీ బిడ్డ అనుకొని దాని మంచీ చెడ్డా చూసుకోండి. ఇవి చేతులు కావు కాళ్ళు" అన్నాడు. ఆయనంతగా చెప్తుంటే కాదనలేక "సర్లెండి దానికేం భాగ్యం" అని మాట ఇచ్చేశాను. అటు వెళ్ళినప్పుడల్లా సీతను చూస్తూనే ఉన్నాం. నెల తప్పింది. పిల్ల నీరసంగా ఉంటోంది. అత్త స్వభావం మార్చలేం కదా! అందుకే మార్గాంతరం ఆలోచించాం.

నా ఇల్లాలు వెళ్ళి "వదినా నువ్వెలాగూ నిత్యం పూజ చేస్తూనే ఉంటావు రోజూ శుభ నక్షత్రే, శుభ తిథే అనే బదులు తిథి నక్షత్రం చెప్పి పూజ చేసుకో. పండంటి మనవడు పుడతాడు" అని చెప్పింది.

"సలహా బాగానే ఉంది గానీ, ప్రతి రోజూ నాకెవరు చెప్తారు?" అందిట ఆవిడ.

"దానికేం భాగ్యం. మీ అన్నయ్య గారినడిగితే చెప్పరా!" అందిట ఈవిడ.

"అదేమిటి వదినా! చెట్టంత మనిషిని పట్టుకుని ప్రతిరోజూ తిథీ నక్షత్రం అడగాలంటే మొహమాటంగా ఉండదూ!" అందిట ఆవిడ.

"నువ్వెందుకు రావడం? నీ కోడలుందిగా. దానికేం పనా పాటా? దాన్ని పంపు" అని సలహా ఇచ్చిందిట ఈవిడ. అప్పటినుంచి ఈ వంకన వస్తోంది సీత. వివరంగా చెప్పాడాయన.

వరలక్ష్మమ్మ అందుకుంది. "దీని రాక మాకు ఇబ్బందిగా ఉందని ఇంత గొంతేసుకుని అరుస్తాను. ఈ విషయం ఆ నోటా ఆ నోటా పడి ఆవిడకి చేరుతుంది. కోడల్ని ఎవరైనా ఆడిపోసుకుంటే ఆ అత్తకి పరమానందం కదూ. అందుకే ఠంచనుగా కోడల్ని పంపిస్తుంది. కుంపటి వెలిగించగానే కొంచెం బియ్యం అత్తెసరు పడేస్తే, నేను కూర తరుక్కునే వేల్టికి ఉడికిపోతుంది. ఇంత పచ్చడి వేసి కలిపి పెడితే తింటుంది బిడ్డ. అయినా ఇంకెన్నాళ్లో లేదులే. అయిదో నెల రానే వచ్చింది. ఏడో నెల రాగానే పురిటికి తీసుకు వెళ్తారు పుట్టింటివాళ్ళు. ఏం చేస్తాం? శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు" అంది వివరంగా చెప్తూ.

అన్నం తినేసి ఆకు అవతల పారేసి గుట్టుగా చెయ్యి కడుక్కుని వచ్చింది సీత.

"వెళ్తున్నానండీ!" అని వెళ్ళిపోబోయింది. "ఇదో అయోమయం మేళం. ఆత్మారాముడు శాంతించాడుగా, ఇక తుర్రుమంటుంది. కాస్తాగమ్మా, ఇవాళ సప్తమి నక్షత్రం శతభిషం" అని గుర్తు చేశాడు భూషణం.

నవ్వేసి వెళ్ళిపోయింది సీత. వరలక్ష్మమ్మ ఆధ్యాత్మిక రామాయణ కీర్తనలు చదువుకుంటూ వంటగదిలోకి వెళ్ళిపోయింది.

ఆయన "త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం" అనుకుంటూ గంధం తియ్యడంలో నిమగ్నుడై పోయాడు. మనసులోనే వారిద్దరికీ నమస్కారం చేసుకుని శ్యామల హాల్లోకి వెళ్ళిపోయింది.

*ఈనాడు ఆదివారం, 13 అక్టోబర్ 2002*